క్లుప్తంగా

ఘన నివాళి



పొదలకూరు: పట్టణానికి చెందిన శివాలయం మాజీ చైర్మన్ తన్నీరు సుబ్రహ్మణ్యం తల్లి మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఆమె భౌతిక కాయానికి నివాళులర్పించారు.

కలశాలతో భారీ ఊరేగింపు



బుచ్చిరెడ్డిపాళెం: కన్యకాపరమేశ్వరి మాత ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకొని మహిళలు 108 కలశాల్లో తీర్థాన్ని భారీగా ఊరేగింపు నడుమ తీసుకెళ్లారు. అనంతరం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని అభిషేకించారు. ప్రత్యేక పూజలు చేసి హారతులను సమర్పించారు. స్థానిక ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

కూచిపూడి శిక్షణ కేంద్రం ప్రారంభం

మనుబోలు: మండల కేంద్రంలో వైఎస్సార్ విగ్రహం సమీపంలో కూచిపూడి శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. మడమనూరు గ్రామానికి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్యకారిణి కుమారి కందల సుస్మిత ఆధ్వర్యంలో ఇక్కడ కూచిపూడి నాట్యంలో చిన్నారులకు శిక్షణ ఇస్తారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సై శివరాకేష్ హాజరయ్యారు. కార్యక్రమంలో మనోహర్, పావతి, నాయకులు ఉడతా విజయ్, శివుడు రాజాగౌడ్, పచ్చిపాల రామిరెడ్డి, కలికి సుధీర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు సిబ్బందిపై దాడి

సైదాపురం: మండలంలోని చాగణం పెట్రోల్ బంకులో పనిచేస్తున్న సిబ్బందిపై గురువారం రాత్రి పొదలకూరు మండలంలోని దేగపూడికి చెందిన కుమ్మరగుంట సిసింద్రీ దాడి చేశాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని చాగణం పెట్రోల్ బంకులో పంప్‌బాయ్‌గా సిద్దూ పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఆఫీస్‌లో నిద్రకు ఉపక్రమించాడు. 11.30 గంటలకు పొదలకూరు మండలంలోని దేగపూడి గ్రామానికి చెందిన కుమ్మరగుంట సిసింద్రీ అక్కడికి వచ్చాడు. ఎంతసేపు నిద్ర లేపాలంటూ కేకలు వేశాడు. అంతటి ఆగకుండా ఆఫీస్ అద్దాలు పగులగొట్టాడు. అడ్డు వచ్చిన సిద్దూపై దాడి చేశాడు. బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

నేర నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం



మాట్లాడుతున్న సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, కేసుల ఛేదనకు సీసీ కెమెరాలు దోహదపడతాయని నగర డీఎస్పీ సింధుప్రియ పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఆవశ్యకతపై ఆర్యవైశ్య బులియన్.. నెల్లూరు గోల్డ్ అండ్ డైమండ్స్.. క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ల సభ్యులకు అవగాహన సదస్సును ఆచారివీధిలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో చిన్నబజార్, సంతపేట పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నేరాలు జరగకుండా ఉండేందుకు గానూ దుకాణాల వద్ద సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, దశరథరామారావు తదితరులు పాల్గొన్నారు.

- నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ వ్యాపార వర్గాల ప్రతినిధులతో సమావేశాన్ని స్థానిక ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. వీటిని ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

కుంభమేళాకు ప్రత్యేక బస్సు

నెల్లూరు రూరల్: కుంభమేళాకు నెల్లూరు నుంచి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రత్యేక బస్సును నడపనుందని జిల్లా టూరిజం అధికారి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయం నుంచి ఈ నెల 12వ తేదీ ఉదయం ఆరు గంటలకు బయల్దేరి వివిధ ప్రాంతాల మీదుగా ప్రయాగ్‌రాజ్‌కు చేరుకుంటుందని చెప్పారు. టికెట్ ధర పెద్దలకు రూ.25 వేలు, పిల్లలకు రూ.22,500గా నిర్ణయించారన్నారు. దర్శనం, అల్పాహారం, భోజన ఖర్చులను భక్తులే భరించాల్సి ఉంటుందని, వివరాలకు 98480 07024 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పేదల గూడుపై నిర్లక్ష్యం

- కూటమి ప్రభుత్వంలో పురోగతి లేని పక్కా ఇళ్లు
- నత్తనడకన నిర్మాణాలు
- కాలనీల పేరు మార్చిన వైనం

నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. మహిళల పేరు మీద ఇళ్ల పట్టాలిచ్చారు. గృహాల నిర్మాణం చేపట్టారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు మారిపోయాయి. పక్కాఇళ్ల విషయంలో ఎలాంటి పురోగతి లేదు.



నారికేళపల్లి కాలనీలో పక్కాగృహాలిలా..

ముత్తుకూరు: మండలంలో పక్కాగృహాల నిర్మాణం నత్తనడకన సాగుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇటుక, ఇనుము, సిమెంట్ ధరలు పెరగడంతో పేదలు కనీసం బేస్‌మెంట్లు కూడా నిర్మించుకోలేని పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీగా ఉన్న పేరును చంద్రబాబు సర్కారు 'పీఎంఏవై ఎన్టీయార్ నగర్'గా పేరు మార్చింది. కానీ నిర్మాణాల విషయంలో ఎలాంటి ముందడుగు లేదు.

నాడిలా..

గత ప్రభుత్వం మండలంలో 25 లేఅవుట్లను ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా పేదలకు 3,227 గృహాలను మంజూరు చేశారు. మునుపెన్నడూ లేని విధంగా లేఅవుట్లలో గ్రావెల్ రోడ్లు, విద్యుత్, మంచినీటి వసతులు కల్పించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు కేటాయించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో 1,408 ఇళ్లు పూర్తయ్యాయి. 704 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. వివిధ కారణాలతో మిగిలిన వాటి నిర్మాణం మొదలు కాలేదు. ఎన్నికల అనంతరం ఏర్పడిన కూటమి ప్రభుత్వం వీటి విషయంలో నిర్లక్ష్యం చూపుతోంది. దీంతో ఆయా స్థలాల్లో ముళ్ల చెట్లు పొదల్లా దర్శనమిస్తున్నాయి. అలాగే, గత సంవత్సరం చివరి నెలల్లో కురిసిన భారీ వర్షాలకు కాలనీల్లోని గ్రావెల్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాలకులు ఇక్కడి సమస్యల వైపు కన్నెత్తి చూడలేదు. చంద్రబాబు సర్కారు వచ్చాక మండలంలో కేవలం 80 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ప్రారంభం కాని ఇళ్లు, నిర్మాణాలు నిలిచిపోయిన వాటిపై సమీక్ష చేయలేదు. కృష్ణపట్నం, బ్రహ్మదేవి కాలనీల్లో అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని ఇంజినీర్లు చెబుతున్నారు.



అప్రోచ్ రోడ్డు లేని బ్రహ్మదేవి కాలనీ

పక్కాగృహాలపై దృష్టి సారించాలి



పేదల పక్కాగృహాల కోసం గత ప్రభుత్వం భూములు కొనుగోలు చేసి కాలనీల రూపంలో కొత్త ఊర్లు సృష్టించింది. రాజకీయాలకు అతీతంగా పేదలకు ఇళ్లు మంజూరు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్మాణాలు పూర్తిగా మందగించాయి. క్షేత్రస్థాయిలో సమీక్ష చేసి ఇళ్లు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి.

– గండవరం సుగుణ, ఎంపీపీ

దాడులు చేయడం హేయం



మోహన్‌రావును పరామర్శిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

- మోహన్‌రావుకు అండగా ఉంటాం
- మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): తమ పార్టీ కార్యకర్తలు, నేతలపై టీడీపీ నేతలు దాడులు చేయడం హేయమైన చర్యని కోవూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న పార్టీ నార్తురాజుపాళెం అధ్యక్షుడు, మాజీ వీఆర్వో మోహన్‌రావును శుక్రవారం పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, దీన్ని అడ్డుపెట్టుకొని దాడులకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. కోవూరు నియోజకవర్గానికి మంచి పేరుందని, దాన్ని చెడగొడుతూ సౌమ్యుడిగా, మంచివాడిగా పేరు తెచ్చుకున్న మోహన్‌రావుపై దాడి చేయడం బాధాకరమన్నారు. తామనుకుంటే టీడీపీ నేతలు, కార్యకర్తలు గ్రామాల్లో తిరగలేరని హెచ్చరించారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డంరెడ్డి నిరంజన్ బాబురెడ్డి, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, పార్టీ విడవలూరు, కోవూరు మండలాధ్యక్షులు నవీన్‌రెడ్డి, అనూప్‌రెడ్డి, నేత సాయిరెడ్డి పాల్గొన్నారు.

ఇజ్తిమా నిర్వహణకు విరాళం

కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురంలో ఈ నెల 22, 23న నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఇజ్తిమా నిర్వహణకు వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.25 లక్షల విరాళాన్ని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రకటించారు. చంద్రశేఖరపురంలో ఇజ్తిమా నిర్వహించనున్న ప్రాంతాన్ని ముస్లిం పెద్దలతో కలసి శుక్రవారం వారు పరిశీలించారు. అనంతరం ఏర్పాట్లపై సమీక్షించారు. ఏ అవసరమొచ్చినా తమను సంప్రదించాలని సూచించారు. విరాళమిచ్చిన వేమిరెడ్డి దంపతులకు వక్ఫ్‌బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్ కృతజ్ఞతలను తెలియజేశారు.



ముస్లిం మతపెద్దలతో సమీక్షిస్తున్న వేమిరెడ్డి దంపతులు

పొలాలకు వెళ్లాలంటే నరకయాతన



పాతమినగల్లులో వంతెన ఇలా..

- కూలిన బ్రిడ్జి
- హామీని విస్మరించిన ఎమ్మెల్యే

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పాత మినగల్లులో పొలాలకు వెళ్లే సాగునీటి కాలువపై ఏళ్ల క్రితం నిర్మించిన బ్రిడ్జి సగం కూలిపోయింది. దీంతో రైతులు, వ్యవసాయ కూలీలు పొలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనులు ప్రస్తుతం ముమ్మరంగా సాగుతున్నాయి. చేసేదేమీలేక కాలువ మధ్యలో తూములను ఏర్పాటు చేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. కాగా తాము అధికారంలోకి వస్తే బ్రిడ్జిని నిర్మిస్తామని గత ఎన్నికల సమయంలో పాత మినగల్లులో నిర్వహించిన సభలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి.. ఆమె ఎమ్మెల్యేగా గెలుపొందినా నేటికీ అతీగతీ లేదు. బ్రిడ్జిని నిర్మించి హామీని నిలబెట్టుకోవాలని పలువురు కోరుతున్నారు.

రేపట్నుంచి బ్రహ్మోత్సవాలు

పొదలకూరు: పట్టణంలోని అయ్యప్ప నగర్‌లో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 2 నుంచి 8వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తామని చైర్మన్ బోయిళ్ల మాలకొండారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిరోజున స్వామి, అమ్మవార్లకు విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 3న ఉదయం చిన్న శేష వాహనంపై గ్రామోత్సవం, రాత్రి పెద్ద శేషవాహనంపై గ్రామోత్సవం, 4న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై గ్రామోత్సవం, 5న ఉదయం హనుమంత వాహనం, రాత్రి గరుడ వాహనంపై గ్రామోత్సవం, 6న ఉదయం హంస వాహనం, రాత్రి గజ వాహనంపై గ్రామోత్సవం, 7న ఉదయం వసంతోత్సవం, సాయంత్రం అశ్వవాహనంపై గ్రామోత్సవం, 8న సాయంత్రం ఏకాంతసేవ, రాత్రి అగ్నిగుండ మహోత్సవం జరుగుతుందన్నారు. 6న సాయంత్రం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులకు అన్నదానం తదితరాలను చేపడుతున్నట్లు వెల్లడించారు.

పందుల స్వైర విహారం

పొదలకూరు: కొంతకాలం క్రితం పట్టణంలో పందుల సంఖ్య గణనీయంగా తగ్గి వీధుల్లో పారిశుద్ధ్య మెరుగు పడింది. మళ్లీ పందుల స్వైర విహారం మొదలైంది. వాటిని పెంపకందారులు వీధుల్లో వదిలి వెళుతున్నారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం నిర్వహించిన పీజీ మొదటి సెమిస్టర్, ఎల్‌ఎల్‌బీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో 8 మంది విద్యార్థులు డిబారైనట్లు వర్సిటీ పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలకు 2,344 మందికి గానూ 2,142 మంది హాజరయ్యారు. వివిధ కేంద్రాల్లో ఏడుగురిని డిబార్ చేశారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 1,691 మందికి గానూ 1,573 మంది హాజరయ్యారు. వీఆర్ ఐపీఎస్ కళాశాలలో ఒకరిని డిబార్ చేసినట్లు ఆమె వెల్లడించారు.

జెడ్పీ సీఈఓ విచారణ

మనుబోలు: మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు – నేడు పనుల్లో అవినీతికి జరిగినట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో శుక్రవారం జిల్లా పరిషత్ సీఈఓ విద్యారమ విచారణ చేపట్టారు. ఎంత ఖర్చు చేశారు?, ఏ పనులు చేశారు? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. నివేదిక తయారు చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఈ అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి, హెచ్‌ఎం డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేకం

ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి ఆలయంలో కుంభాభిషేకాన్ని శాస్త్రోక్తంగా శుక్రవారం నిర్వహించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం తదితర పూజా కార్యక్రమాలను జరిపారు. భక్తులు విశేషంగా తరలివచ్చారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గాలి



మాట్లాడుతున్న లక్ష్మీదేవి

ఇందుకూరుపేట: రసాయన ఎరువుల వినియోగాన్ని రైతులు తగ్గించాలని ఏడీఏ లక్ష్మీదేవి కోరారు. మండలంలోని జగదేవిపేటలో శుక్రవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వరిలో నాణ్యత ప్రమాణాలను పాటించి అధిక దిగుబడులను సాధించాలని కోరారు. అనంతరం స్థానిక ఏడీ రాజ్‌కుమార్ మాట్లాడారు. ఇందుకూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లో 15 మంది ఇండిగ్యాప్ రైతులను ఎంపిక చేశామని చెప్పారు. డీఆర్సీ ఏఓ శ్రీనివాస చక్రవర్తి, స్థానిక ఏఓ రఘునాథ్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారులు శిరీష, జ్యోత్స్నరాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఇలానా వసతులు..?



భోజనాన్ని పరిశీలిస్తున్న విజయభారతి

కోవూరు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు సరైన సౌకర్యాల్లేవని, ఇలా అయితే వారు అనారోగ్యానికి గురవుతారని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి పేర్కొన్నారు. పాఠశాలను శుక్రవారం తనిఖీ చేశారు. ఉడకని అన్నాన్ని పిల్లలకు పెడతారానని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ లేదనే విషయం అర్థమవుతోందని చెప్పారు. 800 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో బాత్‌రూమ్‌లు సక్రమంగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం పరిసరాలను పరిశీలించారు. ఎంఈఓ చెంచులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులతో ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: సేంద్రియ వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు తెలిపారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో సేంద్రియ, బిందు సేద్యం ద్వారా కూరగాయలు సాగు చేసే కార్యక్రమాన్ని ఇన్‌చార్జి వీసీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందుల వల్ల నాణ్యమైన పంట రావడం లేదని చెప్పారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల జయప్రదానికి పిలుపు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: దామరమడుగులో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నెల్లూరుల నిర్వహించనున్న సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా నేత జొన్నలగడ్డ వెంకమరాజు పిలుపునిచ్చారు. మండలంలోని దామరమడుగులో ప్రచారాన్ని పార్టీ నేతలతో కలిసి శుక్రవారం చేపట్టారు. ప్రజలు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు.



కోవూరులో..

కోవూరు: నెల్లూరులో నిర్వహించనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బైక్ ర్యాలీని పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత వవ్వేటి సుబ్బారెడ్డి స్మారక స్థూపానికి జక్కా శేషమ్మ నివాళులర్పించారు. పట్టణంలోని మైథిలీ సెంటర్ నుంచి వివిధ ప్రాంతాల మీదుగా ర్యాలీ సాగింది. గండవరపు శేషయ్య, బుజ్జయ్య, సుబ్బారావు, రమణయ్య, వెంకటేశ్వర్లు, భాస్కర్, రమేష్, విజయకుమార్, సర్దార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

గండవరంలో వైద్య శిబిరం



కొడవలూరు: మండలంలోని గండవరంలో వైద్య శిబిరాన్ని యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో అక్కడక్కడా జ్వరాలున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం పాటించాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి కామాక్షయ్య, వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరించారు. హెచ్‌ఈఓ కోటేష్, ఎస్‌యూఓ నాగరాజు, హెచ్‌ఎస్ సురేంద్ర, ఎమ్మెల్‌హెచ్‌పీలు రోజ్‌మేరీ, సౌమ్య, జాస్మిన్, ఏఎన్‌ఎంలు శాంతి, మమత తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సమావేశం



కొడవలూరు: కొడవలూరులో బడి బయటి కిశోర బాలికలను గ్రూపుగా తయారు చేసి స్థానిక అంగన్‌వాడీ కేంద్రం – 1లో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నిర్మల మాట్లాడారు. కిశోర బాలికలు బడికి తప్పక వెళ్లాలని సూచించారు. బాల్య వివాహాలతో సంభవించే దుష్పరిణామాలు, గుడ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు.
కిశోర బాలికలు వేధింపులకు గురవుతున్నట్లు భావిస్తే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 109ను సంప్రదించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్త యాస్మిన్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

బుచ్చిరెడ్డిపాళెం: మద్యం మత్తులో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన గురువారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద పానీపూరి విక్రయిస్తున్న రహీం వద్దకు గోపీ, మరొకరు వెళ్లారు. పానీపూరి తిని డబ్బులివ్వకుండా పక్కనే గోడపై కూర్చొని మద్యం తాగడం మొదలుపెట్టారు. అటుగా వెళ్తున్న పోలీసులు బహిరంగ ప్రదేశంలో మద్యం తాగడం ఏమిటని వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి మందలించి పంపించారు ఆ ఇద్దరూ పానీపూరి బండి వద్దకు వచ్చారు. తాము మద్యం తాగుతుంటే పోలీసులకు చెప్తావా అంటూ రహీంపై గోపీ కత్తితో దాడి చేశాడు. పక్కనే ఉన్న హుల్ అనే స్నేహితుడు అడ్డుపడగా అతడిని కూడా కత్తితో దాడి చేసి గాయపరిచారు. దీంతో బాధితులు శుక్రవారం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోష్‌రెడ్డి తెలిపారు.